క్లుప్తంగా

ఐదు శాతం మినహాయింపు

మహబూబాబాద్: 2024–25 సంవత్సరానికి చెల్లించాల్సిన ఆస్తిపన్ను ఈనెల 30లోపు చెల్లిస్తే 5శాతం మినహాయింపు ఉంటుందని మానుకోట మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

తాగునీటి సౌకర్యం ఏర్పాటు



మహబూబాబాద్ రూరల్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సిబ్బంది తాగునీటి కోసం ఏర్పాటు చేసిన వాటర్ డిస్పెన్సర్ రిఫ్రిజిరేటర్లను ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, ఆర్ఐ వెల్ఫేర్ సాంబశివరావు, ఆర్ఐ సోమల్లు, ఆర్ఐ అనిల్, రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

కేవీకే మల్యాలను సందర్శించిన విద్యార్థులు



కేసముద్రం: పీఎంశ్రీ పథకం కింద స్టడీ టూర్‌లో భాగంగా మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం, జేవీఆర్ హార్టికల్చరల్ రీసెర్చ్ సెంటర్‌ను, కేసముద్రంస్టేషన్ జెడ్పీ హైస్కూల్‌కి చెందిన విద్యార్థులు సోమవారం సందర్శించారు. ఈమేరకు సీనియర్ సైంటిస్ట్ భాస్కర్ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, నర్సింహరెడ్డి, కృష్ణవేణి, చందర్, యాదగిరి, మదన్మోహన్, సురేష్, సదయ్య, శ్రీవిద్య, లక్ష్మీకుమారి, సత్యనారాయణ పాల్గొన్నారు.

అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి

గార్ల: గార్ల మండలంలో బెరైటీస్ ఖనిజ అక్రమ రవాణాను సంబంధిత అధికారులు అడ్డుకట్ట వేయాలని మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్‌లు డిమాండ్ చేశారు. సోమవారం బెరైటీస్ ఖనిజ ప్రాంతాన్ని వారు సందర్శించారు. అక్రమార్కులపై అటవీ, మైనింగ్ అధికారులు చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. సందర్శించిన వారిలో భిక్షపతి, మీరాపఠాన్, విఠల్, శ్రీనివాస్ ఉన్నారు.

గుడుంబా స్వాధీనం

దంతాలపల్లి: మండలంలో సోమవారం 10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కరుణాకర్ తెలిపారు. వివరాల ప్రకారం.. మండలంలోని రామవరం గ్రామంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ క్రమంలోనే గ్రామానికి చెందిన పాండవుల స్వప్న గుడుంబా తయారు చేసి విక్రయిస్తుందనే సమాచారం మేరకు ఆమె ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈమేరకు 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని స్వప్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సర్వసభ్య సమావేశానికి డుమ్మా

దంతాలపల్లి: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి వైద్యురాలు బాద చైతన్య డుమ్మాకొట్టింది. ఆమె స్థానంలో సీహెచ్ఓ బాలాజీని సమావేశానికి పంపింది. అధికారులు ఆస్పత్రిలో జరిగే వైద్య సేవలపై బాలాజీ సరైన సమాధానం చెప్పకపోవడంతో అధికారులు నిలదీశారు. దీంతో వైద్యురాలు ఆస్పత్రిలోనే ఉందని తెలవడంతో ఎంపీపీ ఉమామల్లారెడ్డి, ఎంపీడీఓ వివేక్ రామ్, ఇతర ప్రజాప్రతినిధులు ఆస్పత్రికి వెళ్లి తనిఖీ చేశారు. హాజరు పట్టికను పరిశీలించారు. విధుల్లోకి వచ్చిన సిబ్బంది సంతకాలు కూడా చేయకపోవడంతో ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దరఖాస్తు చేయకుండానే సీఎల్ సెలవు మంజూరు చేయడం, పలు అంశాలు వైద్యురాలు నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతుందన్నారు. సమస్యలపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే



నెల్లికుదురు: పవిత్రమైన రంజాన్ పండుగను పురస్కరించుకుని మండల కేంద్రంలోని మసీదులో సోమవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే మురళీనాయక్ పాల్గొన్నారు.

అన్నదానం

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మురళీనాయక్ సోమవారం ప్రారంభించారు.

ఓటు వేద్దాం.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం

మహబూబాబాద్ రూరల్: మహాలక్ష్మి మండల సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మహిళా సంఘాలతో ఓటరు అవగాహన ర్యాలీ సోమవారం నిర్వహించారు. ఓటు వేద్దాం.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం అంటూ ఓటు హక్కు వినియోగంపై ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఏపీఎం తిలక్, సంఘ సభ్యులు, వీఓలు, సీసీలు, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

గూడూరు: ఓటు వజ్రాయుధం లాంటిదని, ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఐకేపీ డీపీఎం రాజు అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం నుంచి ప్రధాన బస్టాండ్ సెంటర్ వరకు సోమవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఓటు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన బస్టాండ్ సెంటర్‌లో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రవీందర్, ఉదయశ్రీ మండల సమాఖ్య కార్యవర్గంతో పాటు పలు మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

దంతాలపల్లి: ప్రతీ ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, ఐకేపీ ఏపీఎం బిట్ల దివాకర్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ నజీముద్దీన్, అంగన్‌వాడీ సూపర్ వైజర్ సుధ, ఐకేపీ సీఏలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

చిన్నగూడూరు: యువతీ, యువకులు ఓటు హక్కు వినియోగించుకోవాలని స్వీప్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో మహిళా సంఘ సభ్యులు, వీవోఏలు, అంగన్‌వాడీ టీచర్లు ఓటరు అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యాకయ్య, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

డోర్నకల్: ఓటు హక్కు వినియోగంపై డోర్నకల్‌లో సోమవారం స్వీప్ కార్యక్రమంలో భాగంగా డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఏ జయశ్రీ, ఎంపీడీఓ శ్రీనివాసనాయక్, ఎంపీఓ మీర్జా మున్వర్‌అలీ, ఐకేపీ ఏపీఎం శంకర్‌నాయక్, సీడీపీఓ ఎల్లమ్మ, ఆర్ఐ రామా పాల్గొన్నారు.

మరిపెడ/ మరిపెడ రూరల్: ఓటు హక్కు విలువైందని, ప్రతీ ఒక్కరు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఏపీఎం బానోతు రాములు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఐకేపీ ఆధ్వర్యంలో సోమవారం ఓటు హక్కుపై ఐకేపీ వీవోఏలు, అంగన్‌వాడీ టీచర్లు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీలు రుక్మిణి, శ్రీను, మంగమ్మ, జానీమియా, చందులాల్, నాగిరెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు సీహెచ్ కరుణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్, అంగన్‌వాడీ టీచర్లు, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సభ్యురాలు అరుణ పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: ర్యాలీగా వెళ్తున్న ఏపీఎం తిలక్, తదితరులు



గూడూరు: ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు



డోర్నకల్: ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ..



చిన్నగూడూరు: మండల కేంద్రంలో..



మరిపెడ: ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



దంతాలపల్లిలో..

కాల్వ కుదింపుపై విచారణ చేపట్టాలి

మహబూబాబాద్: జిల్లా కేంద్రం శివారులో మెడికల్ కాలేజీ రోడ్డులో ఉన్న 26ఫీట్ల ఎస్ఆర్ఎస్పీ కాల్వను మూడు ఫీట్ల కాల్వగా మార్చిన వారిపై చర్య తీసుకోవాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ఇరిగేషన్‌శాఖ ఈఈ కార్యాలయం ఎదుట ఆందోళన చేసి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా అజయ్‌సారథి రెడ్డి మాట్లాడుతూ.. కాల్వను సుమారు కిలోమీటరు మేర కుదించారని, వెంటనే విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కాల్వ కుదింపుతో రైతులకు నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు వారి స్వలాభం కోసం కాల్వను డ్రెయినేజీలా నిర్మాణం చేశారన్నారు. కార్యక్రమంలో పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, రేషపల్లి నవీన్, శ్రావణ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

కబేళాకు తరలిస్తున్న దూడల పట్టివేత



పట్టుకున్న దూడలతో హిందూ సమాజం బాధ్యులు

మహబూబాబాద్ రూరల్: గూడ్స్ ఆటోల్లో ఏడు ఆవు లేగదూడలను కబేళాకు అక్రమంగా తరలిస్తుండగా మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి గ్రామంలో హిందూ సమాజం బాధ్యులు సోమవారం పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. కంబాలపల్లి, ఇతర గ్రామాలలో లేగ ఆవు దూడలను కొనుగోలు చేసి మహబూబాబాద్ పట్టణంలోని కమేలాకు మూడు గూడ్స్ ఆటోల్లో అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో ఆ వాహనాలను పోలీసులు ఆపి డ్రైవరును అదుపులోకి తీసుకున్నారు. పట్టణంలోని కామధేను గోశాలకు లేగ దూడలను తరలించారు. ఫిర్యాదు చేస్తేనే పోలీసులు పట్టుకుంటున్నారని, లేని పక్షంలో చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని హిందూ సమాజం బాధ్యులు ఆరోపించారు. కార్యక్రమంలో ఇందుభారతి, సురేష్, ప్రశాంత్, రాజేష్, రవీందర్, కృష్ణ, రాణాశంకర్, ప్రేమ్‌సాగర్, రోహిత్, నరేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల పనితీరు మార్చుకోవాలి

దంతాలపల్లి: అంగన్‌వాడీ టీచర్లు తమ పనితీరు మెరుగుపర్చుకోకపోతే ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎంపీపీ ఒల్లాద్రి ఉమామల్లారెడ్డి అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కుమ్మరికుంట్ల ఎంపీటీసీ సభ్యుడు దుబ్బాకుల వెంకన్న, ప్రజలు గ్రామ అంగన్‌వాడీ సెంటర్ల పనితీరు బాగాలేదని, పౌష్టికాహారం, గుడ్లు సరిగా పంపిణీ చేయడం లేదని ఫిర్యాదు చేశారు. దీంతో అంగన్‌వాడీ టీచర్లపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకొని సక్రమంగా విధులు నిర్వహించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామాలలో తాగునీటి ఎద్దడి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం వ్యవసాయ శాఖ ఏఓ, ఏఈఓలు సమావేశానికి రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వివేక్ రామ్, డిప్యూటీ తహసీల్దారు శ్రీలత, వైస్ ఎంపీపీ కోంపల్లి పద్మ పాల్గొన్నారు.



అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌ను వివరాలు అడుగుతున్న ఎంపీపీ

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



కేసముద్రం: కల్వలలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ గంట సంజీవరెడ్డి

కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామంలో నవయువ యూత్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని, మాజీ సర్పంచ్ గంట సంజీవరెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అరుణజ్యోతి, బాలకృష్ణారెడ్డి, శ్రీను, చందాగోపి, ఎల్లాగౌడ్, పిచ్చయ్య, యూత్ సభ్యులు సందీప్, ప్రశాంత్ పాల్గొన్నారు.

మరిపెడ రూరల్: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజలకు చల్లని మంచినీరు అందించడం అభినందనీయమని మరిపెడ వైస్ ఎంపీపీ గాదె అశోక్‌రెడ్డి అన్నారు. మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామంలో జనవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వైస్ ఎంపీపీ సోమవారం ప్రారంభించారు.

తొర్రూరు రూరల్: వేసవిలో ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఉపసర్పంచ్ నల్లూరి రామలింగం, జన వికాస సంస్థ నాయకురాలు వై.రమా కోరారు. సోమవారం మండలంలోని మడిపెల్లి గ్రామంలోని బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శైలజ, శోభారాణి పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నెహ్రూసెంటర్: హమాలీ కార్మికులకు ఉపాధితో కూడిన సమగ్ర చట్టం, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రగతిశీల హమాలీ మిల్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి అన్నారు. జిల్లా లేబర్ కార్యాలయంలో ఏఎల్ఓ రమేష్‌కు సోమవారం వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హమాలీలకు పనిభద్రత, సంక్షేమ బోర్డు ఏర్పాటు లేకపోవడంతో కార్మికుల బతుకులు భారంగా మారుతున్నాయన్నారు. ప్రభుత్వాలకు విన్నవించినా కార్మికుల సమస్యల్ని పరిష్కరించడంలో విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీలను ఉద్యోగులుగా గుర్తిస్తూ కనీస వేతనం రూ.26వేలు, ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పర్వత కోటేష్, బచ్చలకూర సురేష్, పూసం రాజ్‌కుమార్, లింగన్న, వెంకన్న, ఉపేందర్, వీరభద్రం పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆటోను ఢీకొట్టిన బొలెరో వాహనం

ఒకరి మృతి, ముగ్గురికి తీవ్రగాయాలు

గార్ల: ఆటోను బొలెరో వాహనం ఢీకొట్టిన ఘటనలో ఆటోడ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందగా, మరో ముగ్గురు ప్రయాణికులకు తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం రాత్రి సత్యనారాయణపురం గ్రామం వద్ద చోటుచేసుకుంది. ఎస్సై జీనత్‌కుమార్ తెలిపిన వివరాలు.. ఆటో డ్రైవర్ దబ్బేటి బుచ్చిరాములు(52) కుటుంబ సభ్యులతో ఆటోలో మహబూబాబాద్ వైపు వెళ్తుండగా వెనుక నుంచి అతి వేగంగా వస్తున్న బొలెరో వాహనం ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ బుచ్చిరాములు అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు, దబ్బేటి పద్మ, అమృతమ్మ, కొమురయ్యలకు తీవ్ర గాయలు కావడంతో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సంక్షిప్త సమాచారం

పాఠశాలలో ఉగాది వేడుకలు



దంతాలపల్లి: మండలంలోని దాట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపీపీఎస్ వాల్యా తండా పాఠశాలలో సోమవారం ఘనంగా తెలుగు సంవత్సరాది వేడుకలు నిర్వహించారు. ఉగాది పచ్చడి చేసి పిల్లలకు ఉగాది పచ్చడి రూచి చూపించారు. అనంతరం తెలుగు సంవత్సరాది విశిష్టతను, ప్రత్యేకతను విద్యార్థులకు తెలిపారు.

రంజాన్ కిట్ల పంపిణీ

కేసముద్రం: మండల కేంద్రంలో పేద ముస్లిం కుటుంబాలకు, ఖాజాహఫీజున్నీసాబేగం (ఎస్సై, సీఐడీ), అబ్దుల్ అమీద్ దంపతులు ఖాజామొహినుద్దిన్ జ్ఞాపకార్థం రంజాన్ కిట్లను సోమవారం అందజేశారు. రంజాన్ సందర్భంగా కేసముద్రంస్టేషన్ పరిధిలోని సుమారు 100 కుటుంబాలకు, 8 రకాల సరుకులతో కూడిన కిట్లను, తమ స్వగృహం వద్ద అందించినట్లు వారు తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ

కురవి: మండల కేంద్రంలో ద్విచక్రవాహనం చోరీకి గురైంది. సోమవారం బాధితుడు దడిగల బిందుకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ద్విచక్ర వాహనాన్ని ఏపీజీవీబీ బ్యాంకు పక్కన ఉన్న అద్దె ఇంటి ఎదురుగా ఆదివారం రాత్రి పార్కింగ్ చేశాడు. ఉదయం చూస్తే బైక్ కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికిన కనిపించలేదు. దీంతో కురవి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

కోర్టుకు తరలింపు

గార్ల: భూ వివాదంలో అత్తాకోడళ్ల మధ్య జరిగిన ఘర్షణలో కోడలును అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం మహబూబాబాద్ కోర్టుకు తరలించినట్లు ఎస్సై ఎస్.జీనత్‌కుమార్ సోమవారం తెలిపారు. వివరాలిలావున్నాయి. మండలంలోని చిన్నసరిహద్దు తండాకు చెందిన తేజావత్ అచ్చాలి, ఆమె కోడలు తేజావత్ గంగల మధ్య భూమి విషయంలో ఘర్షణ చోటుచేసుకుంది. ఘర్షణలో అత్తపై కోడలు దాడి చేయడంతో అత్త తలకు బలమైన గాయమైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కోడలుపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అనారోగ్యంతో ఆశకార్యకర్త మృతి

డోర్నకల్: మండలంలోని మల్లాయికుంట తండాకు చెందిన ఆశ కార్యకర్త తేజావత్ మంగమ్మ(42) సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మృతికి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సంతాపం తెలిపారు. మృతురాలికి భర్త ముగ్గురు పిల్లలు ఉన్నారు.

విద్యార్థులకు పాదరక్షల పంపిణీ

నెల్లికుదురు: మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి గ్రామ యూపీఎస్‌లో గ్రామానికి చెదిన కొండపల్లి గోపాల్‌రావు నిరుపేద విద్యార్థులందరికీ సోమవారం పాదరక్షలు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సోదరభావంతో పండుగలు నిర్వహించుకోవాలి

గార్ల: ఉగాది, రంజాన్ పండుగలను హిందూ, ముస్లింలు సోదరభావంతో జరుపుకోవాలని ఎస్సై ఎస్.జీనత్‌కుమార్ సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హిందు, ముస్లింలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో హిందువులు, ముస్లింలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉగాది పంచాంగం ఆవిష్కరణ

తొర్రూరు: బ్రాహ్మణ అఫిషియల్స్ ఆధ్వర్యంలో ముద్రించిన ఉగాది పంచాంగంను సోమవారం డివిజన్ కేంద్రంలో సంఘ ప్రతినిధులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బోప్పా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్, జిల్లా అధ్యక్షుడు రాంబాబు, లక్ష్మణాచార్యులు పాల్గొన్నారు.

కాశీకి పాదయాత్ర



దంతాలపల్లి: అన్నమయ్య తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన భక్తుడు శివలీలకుమార్ స్వగ్రామం నుంచి కాశీ వరకు పాదయాత్ర చేస్తున్నాడు. సోమవారం అతడు దంతాలపల్లికి చేరుకున్నాడు. గత నెల 21న ఇంటి నుంచి పాదయాత్ర ప్రారంభించినట్లు తెలిపాడు.

పురస్కారం అందజేత

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయ ప్రధాన అర్చకులు, గుణనిధి ముదుంబై లక్ష్మీనారాయణచార్యులును రాజమండ్రిలో వైదిక జ్యోతిష్య సమ్మేళనం, ఉగాది పురస్కారాల కార్యక్రమంలో సువర్ణ కంకణ పురస్కారం అందజేసి సన్మానించారు.

నవోదయలో సీటు

కురవి: మండల కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్‌లో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు డీఎస్ సుశాంత్, బి.అశ్విక రాథోడ్‌లు ఇటీవల విడుదలైన నవోదయ పరీక్షా ఫలితాల్లో సీటు సాధించినట్లు పాఠశాల హెచ్ఎం అల్వాల కార్తీక్ సోమవారం తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

గంగారం: పురుగుల మందు తాగి వివాహిత మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పందెం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై రవి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పందెం గ్రామానికి చెందిన కురుసం సౌందర్యకు(25), భర్త బాలకృష్ణ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త వ్యవసాయ పనులు చేయకుండా తరచూ బంధువుల వేడుకలకు వెళ్తున్నాడు. ఈక్రమంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తున్నాయని ఎన్నిమార్లు చెప్పిన భర్త మారడం లేదని, ఈనెల 4న సౌందర్య పురుగుల తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైనా చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు రేఫర్ చేయగా ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి బచ్చల స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పలువురి బైండోవర్

గార్ల: రానున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మండలంలో డీజే నిర్వాహకులను బైండోవర్ చేసినట్లు ఎస్సై జీనత్‌కుమార్ సోమవారం తెలిపారు. మండలంలో డీజే నిర్వహిస్తున్న పూసల తండాకు చెందిన భూక్యా సుధీర్, మూడుతండాకు చెందిన బోడ శ్రీకాంత్, పులిగుట్ట తండాకు చెందిన వాంకుడోత్ కల్యాణ్‌లపై బైండోవర్ కేసు నమోదు చేసి తహసీల్దార్ రవీందర్ ఎదుట హాజరు పర్చినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జాగ్రత్తగా ఉండాలి

చిన్నగూడూరు: సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, అపరిచిత వ్యక్తులతో ఫోన్ కాల్స్ గాని వాట్సాప్ కాల్స్‌లో మాట్లాడకుండా జాగ్రత్తగా ఉండాలని షీటీం ఎస్సై సునంద అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీ ఎస్పీ ఆదేశానుసారం అడిషనల్ ఎస్పీ చెన్నయ్య ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఓ లలిత, ఏఎస్సైలు ఆనందం, పాపయ్య పాల్గొన్నారు.